'రైతుభరోసా' ఇంకెప్పుడు?

కోనరావుపేట మండలంలో వరినాట్లు వేస్తున్న మహిళలు (ఫైల్)

- సీజన్ ప్రారంభమై మూడు నెలలైనా అందని సాయం
- విధివిధానాలంటూ సర్కారు దాటవేసే ప్రయత్నం
- పంటపెట్టుబడి ఎదురు చూస్తున్న రైతాంగం
- లాగోడికి అప్పు చేస్తున్న వైనం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): దేశానికి అన్నంపెట్టే రైతును రాజు చేయాలన్న ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎకరానికి ₹5వేల చొప్పున పెట్టుబడికి సాయం అందించింది. మెట్ట ప్రాంతానికి కాళేశ్వరం జలాలు తీసుకువచ్చి భీడు భూములను సస్యశ్యామలం చేసింది. ఓ వైపు సమృద్ధిగా సాగునీరు, మరోవైపు పంట పెట్టుబడి సాయంతో వ్యవసాయరంగాన్ని పండుగలా మార్చింది. ప్రస్తుతం వానకాలం సీజన్ ప్రారంభమై మూడు నెలలు పూర్తికావొస్తున్నది. ఇప్పటికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా విడుదల చేయకపోవడంతో అన్నదాతలు అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నారు. ఇప్పటికైనా రైతుభరోసా అందుతుందా? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

1,29,050 మంది ఎదురుచూపు

కేసీఆర్ ప్రభుత్వం పంట సీజన్ ప్రారంభం కాగానే పెట్టుబడి సాయం కింద ఎకరానికి ₹5వేలు రైతుల బ్యాంకు ఖాతాలో వేసింది. ఎరువులు, విత్తనాలకు మరొకరి వద్ద చేయి చాపకుండా రైతులు గర్వపడేలా సాయం అందించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ద్వారా ఎకరానికి ₹7,500 ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ప్పటికి ఇప్పటికి రైతుభరోసా' ఇవ్వలేదు. జిల్లాలో అర్హులైన మొత్తం రైతులు 1,29,050 మంది ఉండగా, 2,45,866ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత యాసంగిలో ₹129.72 కోట్ల పెట్టుబడి సాయం అందించింది.

ఆందోళనలో రైతాంగం

వానకాలం పంట సీజన్ పారంభమైనప్పటికీ ప్రభుత్వం ఇప్పటికీ రైతులకు భరోసా కల్పించలేదు. విధివిధానాలంటూ సర్కారు దాటవేసే ప్రయత్నం చేస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. విత్తనాలు, ఎరువుల కోసం అప్పులు చేయకతప్పడం లేదంటూ రైతులు వాపోతున్నారు. పెట్టుబడి కింద ఎకరానికి ₹7,500 ఇస్తుందా? లేక విధివిధానాల పేరిట దాటవేస్తుందా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేసీఆర్ హయాంలో పైసలు ఖాతాలో పడ్డయ్

నాకున్న నాలుగెకరాల్లో వరి పండిస్తున్న. తెలంగాణ రాకముందు నీళ్లకు, పెట్టుబడికి గోస పడ్డం. కేసీఆర్ సార్ పెట్టుబడి సాయం చేసిండు. నీళ్ల, కరెంటు గోస తీర్చిండు. రెండు పంటలకు కలిపి ఏడాదికి ₹40వేలు వస్తుండే. కాంగ్రెస్ వస్తే పెట్టుబడి పెంచుతమన్నరు. చెప్పిన మాటే గానీ ఇప్పటికి ఇంకా ఇయ్యలేదు. చేతిలో పైసల్లేక తిప్పలయితన్నది. పంటలేసి గిన్ని రోజులైనా పెట్టబడి సాయం జెయ్యలేదు. లాగోడికైతే అప్పులు తెచ్చి పెట్టినం.

- ఎక్కలీదేవి కొమురయ్య, రైతు (హరిదాస్‌నగర్)

కోనరావుపేట: కనగర్తి గ్రామంలో కోలాటాలతో గణనాథుడికి స్వాగతం పలుకుతున్న మహిళలు

రుద్రంగి: మండల కేంద్రంలో గణనాథుడి శోభాయాత్రలో పద్మశాలీ సంఘం సభ్యులు

వేములవాడ: గణనాథుడిని నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ, చైర్‌పర్సన్ మాధవి

వినాయకా.. సెలవిక

- భక్తిశ్రద్ధలతో గణేశ్ నిమజ్జనం
- యువకుల నృత్యాలు, చిన్నారుల కోలాటాలతో సందడిగా శోభాయాత్ర

రుద్రంగి: గణనాథుడిని చెరువులో నిమజ్జనం చేస్తున్న భక్తులు

వేములవాడ టౌన్: గణనాథుడి నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

వాడవాడలా కొలువుదీరిన బొజ్జగణపయ్య నవరాత్రోత్సవాలు పూజలందుకుని గంగమ్మ చెంతకు చేరుకున్నాడు. అత్యంత సుందరంగా ముస్తాబు చేసిన వాహనాల్లో గణనాథులను ఉంచి పురవీధులగుండా భజనసంకీర్తనలు, మహిళల కోలాటాలు, యువకుల డీజే నృత్యాల మధ్య శోభాయాత్రగా తరలివెళ్లారు. జై బోలో గణశ్ మహారాజ్ కీ జై.. గణపతి బొప్పా మోరియా.. అంటూ వీడ్కోలు పలికారు. అనంతరం సమీప వాగులు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేములవాడ నిమజ్జన సరళిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుకలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి సందర్శించారు. కాగా, ఇల్లంతకుంట, మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తు హమాలీ నాంపెల్లిపై పడింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా, దవాఖానకు తరలించారు.

- వేములవాడ టౌన్/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/రుద్రంగి/ఇల్లంతకుంట/ముస్తాబాద్/చందుర్తి, సెప్టెంబర్ 16

రుద్రంగి: గణనాథుడి శోభాయాత్రలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముస్తాబాద్: మొర్రాయిపల్లెలో విఘ్నేశ్వరుడికి వీడ్కోలు పలుకుతున్న మహిళలు

వేములవాడలో గణనాథుడి నిమజ్జనం

ఇల్లంతకుంట: కారుపై నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు

బద్ధం ఎల్లారెడ్డికి ఘన నివాళి

ఎల్లారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించి నినదిస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 16: తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం గాలిపెల్లిలో పోరాట యోధుడు బద్ధం ఎల్లారెడ్డి విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ మాట్లాడుతూ, పోరాట యోధుడు మాజీ ఎంపీ, ఎమ్మెల్యే కామ్రేడ్ బద్ధం ఎల్లారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ నెల 17న విలీన వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఇక్కడ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, మల్లయ్య, రాములు, శ్రీధర్, అశోక్, ఆదిత్య, అనిల్, నరేశ్, చందు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గంభీరావుపేట, సెప్టెంబర్ 16: నర్మాలలో ఆర్‌బీఎస్ మాజీ కన్వీనర్ ద్యానబోయిన రాజేందర్ తండ్రి చంద్రయ్య, కొత్తపల్లిలో పార్టీ నాయకుడు సలీం సోదరుడు కురేశ్ ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులను నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మండల నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

గంభీరావుపేట, సెప్టెంబర్ 16: జగదాంబతండా శివారు పెద్దమ్మ స్టేజీ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పట్టుకున్నామని ఎస్ఐ రామ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమానాస్పదంతో తిరుగుతున్న గాజుల వెంకటేశ్ నుంచి 45 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- కేసీఆర్‌నగర్ సందర్శన
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 16: మండెపల్లి శివారులోని కేసీఆర్ నగర్(డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం)లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం అధికార పార్టీ నేతలు, అధికారులతో కలిసి కేసీఆర్‌నగర్‌ను సందర్శించి.. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్మశానవాటిక కోసం స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానాకి ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ జయంత్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్‌అలీ బేక్, కాంగ్రెస్ నేతలు కేకే మహేందర్‌రెడ్డి, నాగుల సత్యనారాయణ, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, జాలగం ప్రవీణ్, రాము, తిరుపతి, శ్రీకాంత్‌గౌడ్, భరత్, తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం

కేసీఆర్‌నగర్‌లో కొంత కాలంగా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులను కలిసి మొరపెట్టుకున్నారు. ఆదివారం సీపీఎం నేతలు సైతం సందర్శించి.. కలెక్టర్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఎట్టకేలకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సందర్శించారు. ఆయనతోపాటు అధికార పార్టీ నేతలు సైతం వచ్చి, కేసీఆర్‌నగర్ వాసుల సమస్యలు పరిష్కరిస్తామని హమీఇచ్చారు.

కేసీఆర్‌నగర్ వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

భూ సమస్య పరిష్కరించాలని..

- సెల్‌టవర్ ఎక్కి రైతు ఆత్మహత్యాయత్నం

చందుర్తి, సెప్టెంబర్ 16: భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్ కార్యాలయ సమీపంలోని సెల్‌టవర్ ఎక్కి ఓ రైతు ఆత్మహత్యాయత్నాకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జగట్టు పొన్నాలు, అతడి సోదరుల మధ్య కొన్నేండ్లుగా భూ సమస్య ఉన్నది. ఈ నేపథ్యంలో తన సమస్యను పరిష్కరించి.. న్యాయం చేయాలని కోరుతూ సెల్‌టవర్ ఎక్కారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో సదరు రైతు సెల్‌టవర్ దిగాడు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

గంభీరావుపేట, సెప్టెంబర్ 16: ఎకానమిక్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందిన వేముల కాశాగౌడ్‌ను సోమవారం శ్రీగాధ గ్రామ పంచాయతీ ఆవరణలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు సన్మానించారు. ఈ సందర్భంగా కాశాగౌడ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కత్తుల బాబు, మాజీ ఉప సర్పంచ్ కాశీ, గ్రామస్తులు బాలరాజు, యాదాగౌడ్, వెంకటస్వామి, శ్రీనివాస్, కార్తీక్, గణేశ్, ప్రశాంత్, రాజు, సంపత్, తదితరులు ఉన్నారు.

జోరుగా కలప దందా

- అనుమతులు లేకుండా నిర్వహణ, అక్రమ కరెంట్ కనెక్షన్లు
- ఫర్నిచర్లు తయారు చేసి పట్టణాలకు తరలింపు
- పట్టించుకోని అధికారులు

కోనరావుపేటలో సామిల్లు వద్ద పట్టుకున్న కలప దుంగలు

కోనరావుపేట, సెప్టెంబర్ 16: మండలంలో అటవీ విస్తరణం అధికంగా ఉన్నది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండడంతో అక్రమ కలప దందా జోరుగా సాగుతున్నది. అటవీ ప్రాంతంలోని చెట్లను నరికివేసి పలువురు సామిల్లుకు తరలించగా.. అక్కడ ఫర్నిచర్ తయారు చేసి పట్టణాలకు తరలిస్తున్నారు. ఈ మిల్లులను అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండానే నిర్వహిస్తుండగా.. పట్టించుకోనే వారు కరువయ్యారు. అక్రమ కలప, అనుమతి లేకుండా కరెంట్ కనెక్షన్లతో ఈ దందాను గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తూ కొట్లాది రూపాయల అటవీ సంపద కొల్లగొట్టున్నా.. అధికారులు మాత్రం ఆడపదడపా దాడులు చేస్తూ నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

నామమాత్రంగా దాడులు...

సిరిసిల్ల, వేములవాడ రేంజ్ పరిధిలో కోనరావుపేట అటవీ ప్రాంతమంతా ఉండగా, వట్టిమల్ల, మరిమడ్ల, కోనరావుపేట, శివంగాళపల్లి, ఏగ్లాస్‌పూర్, ధర్మారం, నిజామాబాద్ గ్రామాల సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నది. అక్కడి నుంచి కలపను మినీ సామిల్లులు ఉన్న మండల కేంద్రంతోపాటు వెంకట్రావుపేట, కొండాపూర్, పల్లిమక్త, సుద్దాల, నాగారం గ్రామాలకు తరలిస్తున్నారు. కాగా, కోనరావుపేట, నిజామాబాద్ గ్రామాల్లో ఇటీవల అధికారులు మినీ సామిల్లులపై ఒకే రోజు దాడులు నిర్వహించారు. విలువైన టేకు కలప దుంగలు భారీగా పట్టుబడడంతోపాటు అక్రమంగా నిల్వ ఉన్న వాటిని పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒక రోజు దాడులు చేస్తేనే కలప పట్టుబడితే.. మిగతా గ్రామాల్లో దాడులు చేస్తే మరెంత ఉందో తెలుస్తుంది. కానీ అధికారులు నామమాత్రంగా దాడులు చేసి మిగితా వాటిపై కన్నెత్తి కూడా చూడడం లేదు.

పల్లెల నుంచి పట్టణాలకు..

కలప దందా పల్లె నుంచి పట్టణాలకు వరకు జోరుగా సాగుతున్నది. అటవీ నుంచి అక్రమంగా టేకు దుంగలను సామిల్లు వారు తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. అక్కడే టీపాయిలు, డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు, సోపాలు తయారు చేస్తున్నారు. సోఫాకు ₹12 నుంచి ₹15వేల వరకు, డైనింగ్ టేబుళ్లు కుర్చీలు ₹20 నుంచి ₹25వేల వరకు విక్రయిస్తున్నారు. తయారు చేసిన ఫర్నీచర్‌ను వేములవాడ, సిరిసిల్ల, కామారెడ్డి వంటి ప్రాంతాలకు రాత్రి వేళలో తరలించి వ్యాపారం చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పట్టికి చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ సంపదను కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు, గ్రామస్తులు సైతం కోరుతున్నారు.

చట్టపరమైన చర్యలు తప్పవు

కలప అక్రమ దందా చేస్తే ఎంతటివారైన సహించేది లేదు. గ్రామాలలో సామిల్లులు నడిపే వారి వద్ద కలప దందా సాగుతున్నట్లు మాకు సమాచారం ఉన్నది. ఇప్పటికే పలు గ్రామాల్లోని సామిల్లులో దాడులు నిర్వహించాం. కోనరావుపేట, నిజామాబాద్ గ్రామాల్లని సామిల్లుల వద్ద విలువైన కలప దుంగలు పట్టుకున్నాం. కలపను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై కేసు నమోదు చేశాం. మిగతా గ్రామాల్లో కూడా దాడులు చేస్తాం. కలప అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదు.

– మోహన్‌లాల్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (వెంకటాపూర్)

నేడే గణేశ్ నిమజ్జనం

- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

మానేరు బ్రిడ్జి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్, ఎస్పీ అఖిల్‌మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మఒడికి చేరేందుకు సన్నద్ధమవుతున్నాడు. మంగళవారం జరుగనున్న నిమజ్జనోత్సవాల కోసం అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 2,200గణపతులను నిమజ్జనం చేయనుండగా, పట్టణంలో 600గణపతులను గంగమ్మఒడికి తరలించనున్నారు.

మానేరు బ్రిడ్జి వద్ద..

భారా వర్షాలతోపాటు గోదావరి జలాలతో మానేరుకు జలకళ వచ్చింది. గీతానగర్ మానేరు ఒడ్డున చేయాల్సిన నిమజ్జనోత్సవాన్ని ఈ సారి బ్రిడ్జి వద్దకు మార్చారు. బ్రిడ్జి వద్ద నిమజ్జనానికి మున్సిపల్‌శాఖ ముమ్మర ఏర్పాట్లు చేసింది. రెండు పెద్ద క్రేన్లు, ట్రాక్టర్లు, ట్రిప్పర్లతో చదును చేస్తున్నారు. వాగులోకి వాహనాలు దిగేందుకు రెండు వైపుల ర్యాంపులు ఏర్పాటు చేశారు. 12 నుంచి 20అడుగుల వరకు వినాయకులను నిమజ్జనం చేసేందుకు అతిపెద్ద క్రేన్లను హైదరాబాద్ నుంచి తెప్పించారు. ఎలాంటి ప్ర మాదాలు జరుగకుండా పోలీస్‌శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. మానేరు చుట్టూ బల్దియా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసింది.

600మంది బందోబస్తు

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్, మున్సిపల్‌శాఖలు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాయి. నిమజ్జనం కోసం 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, డీఎస్పీలు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. రాత్రి 11గంటల వరకు నిమజ్జనం పూర్తి చేయాలని మండప నిర్వాహకులను అధికారులు ఆదేశించారు. కాగా, వివిధ మండలాలు, పట్టణంలో సోమవారం నుంచే నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో వసంతరావు

క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ షాదీఖానలో నిర్వహించిన శిబిరాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో వసంతరావు వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన సౌజన్యంతో కార్మిక క్షేత్రంలోని ప్రజలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. 25సంవత్సరాలు దాటిన మహిళలకు బ్రెస్ట్, నోటీ, సర్వైకల్ క్యాన్సర్, డిటెక్షన్, మామోగ్రామ్ సర్వైకల్ బయాప్సీ పరీక్షలు, పురుషులకు నోటీ క్యాన్సర్ పరీక్షలు చేశారు. శిబిరంలో మొత్తం 164మంది పరీక్షలు చేయించుకోగా, 43మంది మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, 39మందికి గర్భాశయ క్యాన్సర్, 31 మంది పురుషులకు నోటీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 51మంది మహిళలకు జనరల్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వేములవాడ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, తిలక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన వైద్యుడు పీ చంద్రకాంత్, డైరెక్టర్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నేతలు కేకే మహేందర్‌రెడ్డి, నాగుల సత్యనారాయణ, కాముని వనిత ఉన్నారు.

వ్యవసాయ కూలి ఆత్మహత్య

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 16: వెంకట్రావుపల్లికి చెందిన ఏనుగుల ముత్త య్య(42) అనే వ్యవసాయ కూలి చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ శివారులో చెట్టుకు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ముత్తయ్య భార్య ఎల్లవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, ముత్తయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గీత జ్ఞాన యజ్ఞం కరపత్రాల ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ సమావేశ మందిరంలో సోమవారం గీతజ్ఞాన యజ్ఞం కరపత్రాలను ఆవిష్కరించారు. సిరిసిల్ల చిన్మయ మిషన్, గీత ప్రచార సమితి ఆధ్వరంలో తంగళ్లపల్లిలోని మార్కండేయ ఆలయ సమావేశ మందిరంలో ఈ నెల 24 నుంచి సాయంత్రం 6గంటల నుంచి గీత జ్ఞాన యజ్ఞం ఉపన్యాస, యజ్ఞనంద స్వామితో కర్మయోగంపై ఐదు రోజుల పాటు ప్రవచనాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. అదే విధంగా పద్మనగర్ శివారులోని గాయత్రి ఆశ్రమంలో ఉదయం వేళలో శివాపరాధ క్షమాపణ స్తోత్రంపై ప్రవచనాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘ అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, చిన్మయ మిషన్ అధ్యక్షుడు సజ్జనం శ్రీనివాస్, సిరిసిల్ల గీత ప్రచార సమితి అధ్యక్షుడు కోడం నారాయణ, స్థానిక నేతలు అంకారపు రవీందర్, గజబీంకార్ రాజన్న, మోర శ్రీహరి, మచ్చ ఆంజనేయులు, జనపాల శంకరయ్య, మోర లక్ష్మీరాజం, మచ్చ శ్రీనివాస్, సామల రమేశ్, కోడం రమేశ్ ఉన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘ నాయకులు

నేడు ప్రజా పాలన దినోత్సవం

కలెక్టరేట్, సెప్టెంబర్ 16: ప్రభుత్వ ఆదేశాలతో మంగళవారం ఉదయం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏవో రాంరెడ్డి ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

కోనరావుపేట, సెప్టెంబర్ 16: హెడ్‌కానిస్టేబుల్ గంగయ్య సోమవారం తన కుమారుడు వంశీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్‌కు పేదలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్

విలేజీ కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో రూ.20లక్షల నిధులతో సోమవారం విలేజీ కమ్యూనిటీహాల్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజబీంకార్ రాజన్న, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జాలగం ప్రవీణ్, బీఆర్ఎస్ సీనియర్ నేత పడిగెల రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, నాయకులు మచ్చ శ్రీనివాస్, రాపెల్లి ఆనందం, మోర లక్ష్మీరాజం, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, గజబీంకార్ సంతోష్, పెద్దూరి తిరుపతి, హన్మంతరెడ్డి, మచ్చ ఆంజనేయులు, కోడం రమేశ్, రంగు అంజయ్య, ఆసాని సత్యనారాయణ రెడ్డి, ఎడ్మల శ్రీదర్‌రెడ్డి, సామల రమేశ్, చుక్క శేఖర్, తదతరులు ఉన్నారు.

దవాఖానలో పండ్ల పంపిణీ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 16: సిరిసిల్ల పట్టణంలో ఇంతేజామి కమిటీ మసాజిద్ సిరిసిల్ల ఫలహిదార ఆధ్వర్యంలో సోమవారం మోహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా దవాఖానలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు సలీం మాట్లాడుతూ, గణేశ్ నిమజ్జనం సందర్భంగా ప్రవక్త జన్మదిన వేడుకలకు సంబంధించిన పలు కార్యక్రమాలను ఈ నెల 20న నిర్వహించేందుకు మసీదు కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం బైక్ ర్యాలీ, నమాజ్ అనంతరం శోభాయాత్ర, సాయంత్రం 8గంటలకు అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. ఇక్కడ నయూం, మోసిన్, రఫియొద్దీన్, అంజద్, చాంద్, చాంద్‌పాషా, అమీర్‌పాషా, జకీర్ ఉన్నారు.

పండ్లు పంపిణీ చేస్తున్న మసీదు కమిటీ అధ్యక్షుడు సలీం, నాయకులు